

పారిశుద్ధ్య కార్మికులు, వాచ్‌మెన్ల కుటుంబాలకు దుస్తులు అందజేస్తున్న దృశ్యం



ఫుడ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న మహిళలు

సరిలేరు.. మీకెవ్వరూ!

- సేవకు ప్రతిరూపం.. జెక్‌కాలనీ మహిళా బృందం
- ఉమెన్స్, మదర్స్ డే కార్యక్రమాలతో మహిళా శక్తి చాటింపు
- అలసట, ఒత్తిడికి చెక్ పెట్టేలా వినోదాత్మక కార్యక్రమాల నిర్వహణ

అణువణువూ సంప్రదాయపు కట్టుబాట్లు..మదినిండా సరికొత్త ఆటలు పంచే మధురానుభూతులు.. సంస్కృతికి అద్దంపట్టే పండుగల వేళ.. ఆత్మీయ పలకరింపులతో పులకరింత. నేటి, రేపటి తరానికి సంప్రదాయ విలువలను మోసుకెళ్తూనే ఇంకోవైపు సమాజహితపు ఆలోచనలకు బీజం వేస్తోంది అక్కడి మగువా లోకం. నలుగురు మహిళలు కలిస్తే లోకాన్నే మరిచిపోతారంటారు..కానీ అక్కడ పదుల సంఖ్యలో మహిళలు కలుసుకుంటారు.ఆపై భవిష్యత్తు కార్యాచరణ ఒక రూపం దాల్చుకుంటోంది. ఆ కార్యాచరణ అమలు దిశగా అడుగులు పడుతుంటాయి. నిజంగా అదో మినీభారతం. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాలకు చెందిన వారు స్థిర నివాసాలు ఏర్పరచుకున్న ప్రాంతం అది. ఆంధ్రులు సింహభాగంగా ఉండే ఆ ప్రాంతంలో తెలంగాణ సంప్రదాయ గీతిక బతుకమ్మ తొమ్మిది రోజులు నృత్య తారంగం ఆడుతోంది. షడ్రుచుల సమ్మేళనం ఉగాది ఉత్సాహం ఉవ్వెత్తున లేచి తెలుగు సంవత్సరాదిలోని అసలైన సారాన్ని వడబోస్తారు. మాతృ, మహిళా దినోత్సవం..ఏదైనా సరే మహిళాశక్తికి సాటిరాదు మరేదీ అంటూ వేడుకలను ఉత్సాహంగా జరుపుతూ స్ఫూర్తిని నింపుతున్నారు జెక్‌కాలనీ మహిళలు.

–సనత్‌నగర్

వివిధ రాష్ట్రాల మహిళలు..

దసరా వచ్చిందంటే చాలు కాలనీలో బతుకమ్మ శోభ మొదలవుతోంది. చింతిరెడ్డి ప్రభ అనంతరెడ్డి, ఈఓ అన్నపూర్ణలతో పాటు మహిళలు కమిటీగా ఏర్పడి కాలనీలో రోజుకొక రోడ్డులో ఉత్సవాలు జరుపుతూ తెలంగాణ సాంప్రదాయానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తున్నారు. ఇందులో వివిధ రాష్ట్రాల వారు కూడా పాల్గొంటూ వస్తున్నారు. చివరి రోజు సద్దుల బతుకమ్మ రోజున సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను తయారుచేసిన మహిళలకు బహుమతులు అందజేస్తూ ప్రోత్సహిస్తుంటారు.

ప్రత్యేక దినోత్సవాల నిర్వహణ..

మదర్స్, ఉమెన్స్‌డే.. ఇలా ప్రత్యేక దినోత్సవాలను వైభవంగా నిర్వహిస్తుంటారు. వివిధ రంగాల్లో సేవలు అందించిన వారితో పాటు వయోవృద్ధ మహిళలను సన్మానించి వారి ఆశీర్వచనాలు పొందుతుంటారు. ప్రత్యేక రోజుల్లోనే కాకుండా వీలైనప్పుడల్లా ఫుడ్ ఫెస్టివల్, తంబోలా లాంటి కార్యక్రమాలు నిర్వహించి కాలనీవాసులంతా ఒక్కచోటకు చేరి ఉత్సాహంగా గడుపుతుంటారు. ఇటీవల జరిగిన ఫుడ్‌ఫెస్టివల్‌కు కాలనీ మొత్తం కదిలివచ్చి తమ ఐక్యతను ప్రదర్శించారు.

సేవలకు ప్రాధాన్యం..

మహిళలంతా ఏకమై తమవంతుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. అన్నపూర్ణ నేతృత్వంలో పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు వితరణ, కాలనీలోని అపార్ట్‌మెంట్లలో పనిచేసే వాచ్‌మెన్ల కుటుంబాలకు దుస్తులు, ఇతరత్రా నిత్యావసర సరుకులు పంపిణీ వంటి కార్యక్రమాలను చేస్తున్నారు. అలాగే అనాథ, వృద్ధ ఆశ్రమాల్లో తమవంతు సేవలు అందిస్తూ వస్తున్నారు. చలికాలంలో అభాగ్యులకు దుప్పట్లు, రగ్గుల పంపిణీ చేస్తుంటారు. కోవిడ్ సమయంలో పలుచోట్ల నిత్యావసర సరుకుల పంపిణీ చేపట్టారు.ప్రతి నెలా కిట్టీ పార్టీల పేరుతో మహిళలు కలుసుకుంటూ వివిధ రకాల ఆటలతో ఉల్లాసంగా గడుపుతుంటారు. ఏమాత్రం వయస్సు తేడా లేకుండా అందరూ అన్ని రకాల పోటీల్లో పాలుపంచుకుంటారు.



అందరి సహకారంతో..

కాలనీ మహిళలందరినీ భాగస్వాములను చేస్తూ సంస్కృతిని ప్రతిబింబించే వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. వివిధ సందర్భాల్లో మహిళలందరూ కలుసుకుంటే ఆ అనుభూతే వేరు. కాంక్రీట్ జంగిల్ అయిన నగరంలో ఒకరికి మరొకరు తోడు అన్నట్లుగా జెక్‌కాలనీ మహిళలు ఐక్యతకు ప్రతిరూపంగా నిలుస్తున్నారు. మున్ముందు మరిన్ని కార్యక్రమాల రూపకల్పన చేసి అందరూ పాలుపంచుకుంటాం.

–అన్నపూర్ణ, ఈఓ దేవాదాయశాఖ



ఆత్మ సంతృప్తి లభిస్తోంది..

కాలనీలో బతుకమ్మ పండుగ శోభ అంతా ఇంతా కాదు. అలాగే కిట్టీ పార్టీ అంటే కేవలం తాము ఆనందంగా జరుపుకునే పండుగ లాంటిదే కాదు పండుగల వేళ నిర్వహించే కార్యక్రమాలు, ఇతర సామాజిక సేవా కార్యక్రమాల ప్రణాళికకు ఇదో ప్లాట్‌ఫామ్. వివిధ రూపాల్లో చేపట్టే సేవా కార్యక్రమాల ద్వారా ఆత్మసంతృప్తి కూడా లభిస్తోంది.

–చింతిరెడ్డి ప్రభఅనంతరెడ్డి,



స్నేహ బంధం బలపడుతోంది..

నెలలో ఒక రోజు జరుపుకునే కిట్టీ పార్టీ ఎప్పుడొస్తుందా? అని వారం రోజుల నుంచే ఎదురు చూస్తుంటాం. రకరకాల గేమ్స్‌తో అందరిలోనూ ఉత్సాహం రెట్టింపవుతోంది. మనస్సు రిలాక్సేషన్‌కు ఇదొక వేదిక లాంటిది. కాలనీ మహిళల మధ్య స్నేహ బంధం బలపడడానికి ఎంతో ఉపకరిస్తోంది.

–భాగ్యలత



ఒకే కుటుంబంలా..

బిజీబిజీ లైఫ్‌లో ఇలాంటి కిట్టీ పార్టీలు మనస్సుకు ఊరటనిస్తాయి. సాధారణంగా అపార్ట్‌మెంట్‌లో ఇరుగుపొరుగు ఎవరుంటారో కూడా తెలియని పరిస్థితులు ఉంటాయి. పండుగలప్పుడే కాకుండా కిట్టీ పార్టీ పేరిట నెలకోసారి రకరకాల ఆటలు, పాటలతో ఉల్లాసంగా గడపడం ద్వారా సంబంధ బాంధవ్యాలు మరింతగా మెరుగుపడతాయి. ఒక ఫ్యామిలీ అన్న భావన స్ఫూరిస్తోంది.

–అమరావతి

పెండింగ్ పనుల పూర్తికి వినతి



సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ రవి కిరణ్‌ను కాంగ్రెస్ సికింద్రాబాద్ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్ కోరారు. ఈ మేరకు శుక్రవారం సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో అనేక పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వీలైనంత తొందరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో బ్రహ్మాజీ, అమర్‌నాథ్ గౌడ్‌లు ఉన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్ బకాయి రూ.10 వేల కోట్లు విడుదల చేయాలని తెలంగాణ రిపబ్లికన్ స్టూడెంట్ యూనియన్ (టీఆర్‌ఎస్‌యూ) రాష్ట్ర కన్వీనర్, బోయ హక్కుల పోరాట సమితి (బీహెచ్‌పీఎస్) యువజన విభాగం తెలంగాణ అధ్యక్షులు బోయ రమేష్ శుక్రవారం డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదలలో ఏళ్ల తరబడి జాప్యంతో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కాలేజీల్లో ఫీజులు చెల్లించి డిగ్రీలు తీసుకునేందుకు ఆర్థిక స్తోమతలేని విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని లేని పక్షంలో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు.

12న సనత్‌నగర్ ఐటీఐలో అప్రెంటిస్‌షిప్ మేళా

సనత్‌నగర్: సనత్‌నగర్ ఐటీఐలో ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా–2024 నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ, ఇంటర్మీడియేట్ ఒకేషనల్, డిగ్రీ, బీటెక్ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ మేళాకు హాజరుకావొచ్చన్నారుఉషా, జయలక్ష్మీ హ్యుందాయ్ మోటార్స్, రాధిక ట్రాన్స్‌ఫార్మర్స్, ఏజీఐ గ్లాస్, సన్‌టెక్ సోలార్ ప్యానెల్ సిస్టమ్స్, హెచ్‌ఏఎల్, ఎంటీఐఆర్ వంటి ప్రముఖ కంపెనీలతో పాటు మరో 18కి పైగా బహుళ జాతి కంపెనీలు పాల్గొంటున్నట్లు చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు సోమవారం ఉదయం 9.30 గంటలకు బయోడేటా, ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని సూచించారు. 99088 49165, 89191 90943 లో సంప్రదించాలన్నారు.

ఆలయ స్థలం కబ్జా కానివ్వం

రసూల్‌పురా: తిరుమలగిరి మహంకాళి దేవాలయం స్థలం కబ్జా కానివ్వమని బీజేపీ నాయకులు శ్రీగణేష్ పేర్కొన్నారు. మహంకాళి ఆలయ నూతన కమిటీ సభ్యులుగా ఎన్నికైన వారికి శుక్రవారం ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఆలయం కబ్జా అవుతున్న విషయం తన దృష్టికి వచ్చిందని స్థలం కాపాడేందుకు భక్తులు చేస్తున్న కార్యక్రమానికి తాను న్యాయ ప్రక్రియకు అయ్యే ఖర్చును భరిస్తానని అన్నారు. నూతన అధ్యక్షుడిగా మురళి, ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంత్, కన్వీనర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, సుధాకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నిరంజన్, రామ్‌కిరణ్, ఉత్తమన్, శివకుమార్, సలహాదారులు నాగినేని సరిత ఇతర సభ్యులు ఎన్నికయ్యారు. జీకే కిషోర్, శివకుమార్, ప్రవీణ్‌గౌడ్, హనుమంతరావు, అరవింద్, సంజు పాల్గొన్నారు.

రాజకీయ పరిణామాలపై అధ్యయనం అవసరం



సనత్‌నగర్: రాజకీయాల్లో మారుతున్న పరిణామాలపై అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ. లింబాద్రి అన్నారు. బేగంపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'ఎమర్జింగ్ డైమెన్షన్స్ ఇన్ ఇండియన్ పాలిటిక్స్' అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగే సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన లింబాద్రి మాట్లాడారు. రాజకీయాలపై యువత ఆసక్తి కనబర్చాలన్నారు. ఎవరికి వారు మనకెందుకులే రాజకీయాలు అని వదిలేస్తున్నారని, తద్వారా ప్రశ్నించేతత్వాన్ని కోల్పోతున్నారన్నారు. విద్యా, ఉపాధి రంగాల్లో బేగంపేట మహిళా కళాశాల చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రొ.రవీందర్ మాట్లాడుతూ.. రాజకీయాల విషయంలో యువత ఆలోచనా ధోరణి మారాలన్నారు. సదస్సు నిర్వాహకులు డాక్టర్ రామాచారి, కమల, నర్సింహులు పాల్గొన్నారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే కుష్ఠు నివారణ సులభం

చిలకలగూడ: జాతీయ లెప్రసీ నివారణ పక్షోత్సవాలను పురస్కరించుకుని సీతాఫల్‌మండి అర్బన్ హెల్త్ అండ్ న్యూట్రీషన్ క్లస్టర్ ఆధ్వర్యంలో నామాలగుండు నెహ్రూ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ.. కుష్ఠు సాధారణ చర్మ వ్యాధి మాత్రమేనని, ప్రాథమిక దశలో గుర్తిస్తే నివారణ సులభమన్నారు. కరచాలనం, కలిసి భోజనం చేయడం, ఉమ్మడి మరుగుగొడ్లు వాడడంతో కుష్ఠు వ్యాధి రాదన్నారు. 'బీట్ లెప్రసీ..ప్రివెంట్ స్టిగ్మా..ప్రమోట్ డిగ్నిటీ' నినాదంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అడిషనల్ డీఎం అండ్ హెచ్‌ఓ (ఎయిడ్స్ అండ్ లెప్రసీ) డాక్టర్ నిర్మలప్రభావతి, జిల్లా పారామెడికల్ ఆఫీసర్ వనిత, డిప్యూటీ పారామెడికల్ అధికారి అజ్మీర రమేష్‌నాయక్, నోడల్ ఆఫీసర్ రాణి, ఫిజియోథెరపిస్ట్ బాబురావు, నెహ్రూ స్కూలు హెచ్‌ఎం యాదయ్య, లెప్రసీ సొసైటీ ప్రతినిధులు శివమ్మ, రేఖ, విశాల, రజిత పాల్గొన్నారు.



కుష్ఠువ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వీధివ్యాపారులపై వేధింపులు ఆపండి

చిలకలగూడ: జంట నగరాలలోని వీధి వ్యాపారులపై జీహెచ్‌ఎంసీ, పోలీసుల వేధింపులు ఆపాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన కోరారు. ప్రజాభవన్‌లో శుక్రవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో రాష్ట్ర నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌కు వినతిపత్రం అందించి, చిరువ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. చిలకలగూడ జీహెచ్‌ఎంసీ మైదానం వద్ద గత 30 ఏళ్లుగా రహదారికి ఇరువైపులా పలువురు చిరువ్యాపారులు తోపుడుబండ్లు, పాన్‌డబ్బా, పంక్చర్, పూల షాపులు పెట్టుకుని జీవనోపాధి కొనసాగిస్తున్నారని జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు వాటిని ధ్వంసం చేయడంతో తీవ్రంగా నష్టపోయి, జీవనోపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సికింద్రాబాద్, చిలకలగూడ, మారేడుపల్లి, ఓయూ తదితర ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలే తరుచూ జరుగుతున్నాయని చిరు వ్యాపారులపై వేధింపులు ఆపి గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కోరగా, నోడల్ ఆఫీసర్ దివ్యదేవరాజన్ సానుకూలంగా స్పందించారని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన తెలిపారు.



నోడల్ అధికారికి వినతిపత్రం ఇస్తున్న పులి కల్పన

సీపీఆర్ నేర్చుకోండి..పునర్జన్మ ప్రసాదించండి



శిక్షణ తరగతుల్లో సీపీఆర్ నేర్చుకుంటున్న వైద్యవిద్యార్థులు, నర్సింగ్ సిబ్బంది

'గాంధీ'లో ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం

గాంధీఆస్పత్రి: సీపీఆర్ నేర్చుకుంటే ప్రాణాపాయస్థితిలో ఉన్నవారికి పునర్జన్మ ప్రసాదించిన వారవుతారని పలువురు వక్తలు అన్నారు. గాంధీ అలుమ్నీ, గ్లోబల్ అలియన్స్, జనహితసేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ గాంధీ అలుమ్నీ ఎడ్యుకేషన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సీపీఆర్ శిక్షణ తరగతులను గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రమేష్‌రెడ్డి, సూపరింటెండెంట్ రాజారావు శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. గుండెపోటుకు గురైన వారికి సీపీఆర్ చికిత్స అందించి ప్రాణాలు కాపాడిన వారంతా డాక్టర్లేనని అన్నారు. అభివృద్ధి చెందిన పలు దేశాల్లోని సుమారు 70 శాతం మంది ప్రజలకు సీపీఆర్, బీఎల్‌ఎస్‌పై పూర్తి అవగాహన ఉందన్నారు. మన దేశంలోనూ ప్రతి ఒక్కరు సీపీఆర్ నేర్చుకోవాలని సూచించారు. మొదటిరోజు సుమారు రెండువేల మంది వైద్య విద్యార్థులు, నర్సింగ్ సిబ్బంది, ఎన్‌సీసీ కేడెట్లు, వలంటీర్లకు శిక్షణ ఇచ్చామని అలుమ్నీ అధ్యక్ష, కార్యదర్శులు జీఆర్ లింగమూర్తి, ఏఆర్ రత్నం తెలిపారు. గాంధీ అలుమ్నీ, గ్లోబల్ అలియన్స్ ప్రతినిధులు డాక్టర్ రాజశేఖర్ కొల్లిపర, రవీందర్ సురకంటి, వేమూరి మూర్తి, మహేశ్వర్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సన్నీడేవిస్, అమెరికా హార్ట్ అసోసియేషన్ ప్రతినిధి డెన్నీస్ మెకాలే, గాంధీ వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ పాల్గొన్నారు.



గాంధీ ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్లకు జ్ఞాపికలు అందిస్తున్న అలుమ్నీ ప్రతినిధులు

నేడు సైన్స్ ఎక్స్ పో

అమీర్‌పేట: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా అమీర్‌పేటలోని ఎస్‌ఆర్‌నగర్ రవీంద్ర భారతి స్కూల్లో సైన్స్ ఎక్స్ పో వేడుకలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సరిత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శనివారం(నేడు) జరిగే ఎక్స్ పోలో పలు రకాల విజ్ఞానిక ప్రదర్శనలు ఉంటాయన్నారు.

మైనంపల్లిని విమర్శిస్తే ఊరుకోం



రసూల్‌పురా: కాంగ్రెస్ పార్టీ నాయకులు మైనంపల్లి హన్మంతరావును క్రిషాంక్ మరోసారి విమర్శిస్తే అంతుచూస్తామని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జైప్రకాష్ హెచ్చరించారు. బొల్లారంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. క్రిషాంక్‌కు పదవీ లేక మతి తప్పి మైనంపల్లిపై విమర్శలు చేస్తున్నాడని డాక్టర్ మైనంపల్లి రోహిత్‌తో వైద్యం చేయిస్తానని అన్నారు. కాంగ్రెస్‌లో టికెట్ ఇవ్వకుంటే బీఆర్ఎస్‌లో చేరి చైర్మన్ పోస్టు దక్కించుకున్నాడని, ప్రస్తుతం ఎలాంటి పదవి లేక తెలంగాణ భవన్‌లో ఉండి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నాడని మరోసారి విమర్శిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. మనోజ్, సుభాష్ రెడ్డి పాల్గొన్నారు.

ఫీజు తగ్గింపుపై చొరవ చూపాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పెంచిన పీహెచ్‌డీ ఫీజు తగ్గింపులో ప్రభుత్వం చొరవ చూపాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు నెల్లి సత్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఫీజులు తగ్గించాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.2 వేల పీహెచ్‌డీ ఫీజును ఆర్ట్స్ కోర్సులకు రూ. లక్ష, సైన్స్ కోర్సులకు రూ.1.25 లక్షలు పెంచారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజులను తగ్గించకుంటే పాలన భవనాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

నమ్మించి డబ్బు నొక్కేశాడు

యువతి ఖాతా నుంచి రూ. 64 వేలు మాయం

చిలకలగూడ: ఉద్యోగం కోసం ఆన్‌లైన్‌లో సెర్చ్ చేస్తున్న ఓ యువతిని నమ్మించి డబ్బులు కాజేసిన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌చార్జి ఎస్‌హెచ్‌ఓ రమేష్‌గౌడ్, అడ్మిన్ ఎస్‌ఐ బాలరాజు వివరాల ప్రకారం.. శ్రీనివాసనగర్‌కు చెందిన ఓ యువతి ఉద్యోగం కోసం ఇంటర్‌నెట్‌లో సెర్చింగ్ చేస్తుండగా ఉద్యోగంతో పాటు అదనంగా డబ్బులు సంపాదించవచ్చనే ఉన్న ప్రకటనలోని నంబర్‌ను సంప్రదించి ఓ వ్యక్తి పరిచయం చేసుకుంది. రూ.2 వేలు చెల్లిస్తే, రెండు రోజుల్లో రూ.4 వేలు వస్తాయని నమ్మించాడు. ఆ వ్యక్తి చెప్పిన బ్యాంకు అకౌంట్‌కు రెండు వేలు చెల్లించగా, రెండు రోజుల తర్వాత నాలుగు వేలు యువతి ఖాతాలో జమ అయ్యాయి. ఈ విధంగా మూడుసార్లు జరగడంతో నమ్మకం కుదిరింది. చివరగా తన వద్ద దాచుకున్న మొత్తం సొమ్ము రూ. 64 వేలు జమ చేయగా తిరిగి తన ఖాతాలో జమ కాలేదు. సదరు వ్యక్తిని సంప్రదించేందుకు యత్నించగా స్పందన రాలేదు. మోసపోయినట్లు గ్రహించి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కంటోన్మెంట్‌లో ఇంజినీర్ల బదిలీలు

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డులో ఇంజినీర్ల అంతర్గత బదిలీలు జరిగాయి. త్వరలో ఇద్దరు సీనియర్లు పదవీ విరమణ పొందనున్న నేపథ్యంలో నూతన ఇంజినీర్లకు సైతం వార్డుల బాధ్యతలు అప్పగిస్తూ సీఈఓ మధుకర్ నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. కంటోన్మెంట్ ఇంజినీర్ గోపాలకృష్ణ, కంటోన్మెంట్ చీఫ్ ప్లానర్ బాలకృష్ణ వచ్చేనెలలో పదవీ విరమణ పొందనున్నారు. వీరిస్థానంలో అడిషనల్ కంటోన్మెంట్ ప్లానర్ ఫణికుమార్, ఉమాశంకర్‌కు పదోన్నతి కల్పించనున్నారు. తాజా బదిలీల్లో భాగంగా ఫణికుమార్ ప్రాతినిథ్యం వహిస్తున్న ఒకటోవార్డుకు అదనంగా అశిష్, ఉమాశంకర్ ప్రాతినిథ్యం వహిస్తున్న ఏడోవార్డుకు రాజేశ్వర్‌ను కేటాయించారు. ఇక అడిషనల్ కంటోన్మెంట్ ఇంజినీర్ సాగర్‌ను ఆరో వార్డు నుంచి తప్పించి, రెండో వార్డు కేటాయించారు. మరో అసిస్టెంట్ ఇంజనీర్ దినేశ్‌ను ఐదోవార్డు నుంచి తప్పించి, నాలుగో వార్డు బాధ్యతలు కేటాయించారు. అసిస్టెంట్ కంటోన్మెంట్ ప్లానర్ రాసాలం శివాజీని ఎనిమిదో వార్డు నుంచి మూడో వార్డు, ఆదిత్య నారాయణను రెండో వార్డు నుంచి ఐదోవార్డుకు బదిలీ చేశారు. ఆరోవార్డు అదనపు ఇంజినీర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న పాల్వాయి తరుణ్‌కు అదే వార్డులోని సిఖ్ రోడ్డుకు కుడివైపున ఉన్న కాలనీలు, బిత్ర జిష్ణు శ్రీనివాస్‌కు ఆరోవార్డులోని సిఖ్ రోడ్డుకు ఎడమ వైపున ఉన్న కాలనీలు కేటాయించారు. అసిస్టెంట్ ఇంజనీర్ బి. కృష్ణ కాంత్ రెడ్డికి ఎనిమిదో వార్డు బాధ్యతలు అప్పగించారు.

గృహజ్యోతి దరఖాస్తుల పరిశీలన

అడ్డగుట్ట: గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్న వారందరూ సంబంధిత ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని మారేడుపల్లి ఎలక్ట్రికల్ ఏఈ శ్రీధర్ సూచించారు. శుక్రవారం అడ్డగుట్టలోని పలు ప్రాంతాల్లో గృహజ్యోతి పథకానికి దరఖాస్తుకు చేసుకున్న దరఖాస్తుదారుల పత్రాల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఏఈ శ్రీధర్ మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కరెంట్ బిల్లు వివరాలు తమకు అందజేయాలని సూచించారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అధికారులే ఇళ్ల వద్దకు వచ్చి వివరాలు నమోదు చేసుకుంటారన్నారు.

బౌద్ధనగర్ డివిజన్‌లో..

బౌద్ధనగర్: డివిజన్‌లోని జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయం, బల్వాడీ స్కూల్, అంబర్‌నగర్, లలిత నగర్ కమ్యూనిటీహాళ్లలో గృహజ్యోతి దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కంది శైలజ హాజరై మాట్లాడుతూ.. తెల్ల రేషన్ కార్డులు ఉన్న ప్రతీ ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మడ్‌ఫోర్ట్ హట్స్‌లో..

రసూల్‌పురా: గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను సేకరించారు. మూడో వార్డు మడ్‌ఫోర్ట్ అంబేడ్కర్ హట్స్‌లో అధికారులు స్థానికంగా ఉన్న ప్రజా చైతన్య యూత్ అసోసియేషన్ సభ్యుల సహకారంతో జింఖానా ఏఈ అర్పితా రెడ్డి లైన్‌మెన్ అంబడి రఘు, సిబ్బంది గుడిసెల్లో నివాసం ఉంటున్న వారి కరెంట్ బిల్లు, తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డు నంబర్లు అనుసంధానం చేసే ప్రక్రియ ప్రారంభించారు. వెంకటరాముడు, రంగప్ప, సందీప్, గురువయ్య పాల్గొన్నారు.

భోలక్‌పూర్‌లో జలమండలి జీఎం పర్యటన

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ భోలక్‌పూర్‌లో శుక్రవారం జలమండలి జీఎం కేఎస్ వినోద్‌కుమార్ తమ సిబ్బందితో కలిసి పర్యటిస్తూ నీటి సరఫరా, తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నట్లు చెప్పారు. ప్రజా సమస్యలను గుర్తించి సకాలంలో వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. నీటి సరఫరా, డ్రైనేజీ ఇతరత్రా సమస్యలను ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. జలమండలి సమస్యల పరిష్కారానికి తమ సిబ్బంది ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తారని చెప్పారు. నిర్మాణాత్మకమైన కార్యచరణతో మంచినీటి సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. ఆయన వెంట బోయిగూడ సెక్షన్ మేనేజర్ బ్రహ్మారెడ్డి, శివశంకర్ ఉన్నారు.

భారీ శబ్దాలు వచ్చే సైలెన్సర్లను అమర్చితే చర్యలు

సనత్‌నగర్: భారీ శబ్దాలు వచ్చే సైలెన్సర్లను అమర్చితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ట్రాఫిక్ డీసీపీ సుబ్బారాయుడు, అడిషనల్ డీసీపీ రంగారావు హెచ్చరించారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా నార్త్‌జోన్ పరిధిలోని ఆరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో శుక్రవారం చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో నిబంధనలు ఉల్లంఘించి బుల్లెట్ వాహనాలను నడుపుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. సైలెన్సర్లను మార్చి శబ్ద కాలుష్యానికి పాల్పడుతున్నట్లుగా గుర్తించిన 130 మంది ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను తొలగించి వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు పాపయ్య, ఉమాశంకర్, మధుబాబు, నాయక్ పాల్గొన్నారు.

కిషన్ అగర్వాల్ దాతృత్వం

లాలాపేట: సికింద్రాబాద్‌కు చెందిన ప్రముఖ ఐరన్ మర్చంట్ కిషన్ అగర్వాల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల పట్ల తన దాతృత్వాన్ని చాటారు. సొంత ఖర్చులతో లాలాపేటలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల (మార్కెట్ స్కూల్)కు చెందిన 197 మంది విద్యార్థులు, 15 మంది ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా 5 ప్రైవేట్ బస్సులను ఏర్పాటు చేసి దోలారి ధని సందర్శనకు తీసుకెళ్లారు. అక్కడి ప్రవేశ టికెట్లతో పాటు అన్ని ఖర్చులు తానే భరించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సొంతగా ఖర్చులు భరించి విహార యాత్రలకు వెళ్లడం అంతగా ఉండదు. కానీ కిషన్ అగర్వాల్ లాంటి దాతలు ముందుకు రావడం, విద్యార్థులకు ఈ అవకాశం కల్పించడం ఎంతో అభినందనీయం అని ప్రధానోపాధ్యాయుడు ప్రతాప్‌రెడ్డి అన్నారు. విద్యార్థులు దోలారి ధనిలో ఆడిపాడుతూ దినమంతా ఆనందంగా గడిపారు. స్విమ్మింగ్, బోటింగ్, క్యామెల్ రైడ్, పప్పెట్ షోలను చూసి ఎంజాయ్ చేశారు.

మజ్దూర్ యూనియన్‌లోకి సీసీఎస్ డైరెక్టర్ మహేష్

అడ్డగుట్ట: సీసీఎస్ 7వ నియోజకవర్గం నుంచి స్వతంత్ర్య డైరెక్టర్‌గా గెలిచిన మహేష్ ద.మ. రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకర్ రావు, జోనల్ అధ్యక్షులు కాల్వ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మజ్దూర్ యూనియన్‌లో చేరగా ఆయనకు యూనియన్ నాయకులు శాలువాతో సత్కరించి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ మురళీధర్, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ ఉదయ భాస్కర్, వరప్రసాద్, కృష్ణ, ఖాజాబాబు, స్వామి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

పూలే, జగ్జీవన్‌రామ్, కాన్షీరామ్‌లకు భారతరత్న ప్రకటించాలి

లాలాపేట: సామాజిక పరివర్తకులు మహాత్మా జ్యోతిరావు పూలే, చదువుల తల్లి సావిత్రీబాయి పూలే, బాబు జగ్జీవన్‌రామ్, బహుజన నేత మాన్య శ్రీ కాన్షీరామ్‌లకు భారతరత్న ప్రకటించాలని స్వేరోస్ నగర కార్యదర్శి కుమార్ షాను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాత్మా జ్యోతిరావు పూలే తన భార్య సావిత్రి బాయి పూలే ద్వారా దేశంలోని మహిళలకు మొట్టమొదటగా చదువు చెప్పారని అన్నారు. భారత పార్లమెంటేరియన్‌గా దాదాపు 50 సంవత్సరాల పాటు ప్రజా సేవ చేసిన జగ్జీవన్‌రామ్, బహుజనులందరిని ఏకతాటిపైకి తీసుకువచ్చి బహుజన వర్గాలకు రాజ్యాధికారాన్ని అందించిన కాన్షీరామ్‌లకు సముచితమైన గౌరవం దక్కాల్సి ఉందన్నారు.

డీఆర్‌ఎంను కలిసిన మజ్దూర్ యూనియన్ నాయకులు

అడ్డగుట్ట: సికింద్రాబాద్ డివిజన్‌లోని కాజీపేట డీజిల్ లోకో షెడ్‌కు జాతీయ ఉత్తమ మెయింటేనెన్స్ విభాగంలో బహుమతి రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ డీఆర్‌ఎం భరతేష్ కుమార్ జైన్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. డీజిల్ లోకో షెడ్డులు ఎలక్ట్రికల్ ట్రాక్షన్‌కు అవార్డు రావడం గొప్ప విషయమని, కార్మికుల ఐకమత్యంతోనే సాధ్యమైందని డీఆర్‌ఎం భరతేష్ పేర్కొన్నారు. మజ్దూర్ యూనియన్ జోనల్ అధ్యక్షులు శ్రీనివాస్, ఖాజాబాబు, చిలుక స్వామి, శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

నృత్యోత్సవం



సుభాష్‌రోడ్‌లోని సెయింట్ ఆంథోనీ బాలికల ఉన్నత పాఠశాల వార్షికోత్సవంలో విద్యార్థినులు నృత్యాలు మైమరిపించాయి. గుంటూరు ప్రావిన్స్ ప్రావిన్షియల్ సుపీరియర్ సీఎస్‌ఏ రెవరెండ్ సిస్టర్ శౌరిలు, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ చిరంజీవి హాజరై మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణ, అంకితభావంతో ముందుకెళ్లాలన్నారు.

–రాంగోపాల్‌పేట్